క్లుప్తంగా

అమ్మవారి ఆలయంలో భక్తజన సందడి



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తుల అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ..

గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో వేసవి తీవ్రత దృష్ట్యా ఆదివారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈమజ్జిగ పంపిణీని హైదరాబాద్, ఎల్బీనగర్‌కు చెందిన కుంచాల బ్రహ్మయ్య సౌజన్యంతో ఏర్పాటు చేశాయని అధికారులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠలు



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ముత్యాలమ్మ, సత్యమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠల మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అర్చకులు అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించి ప్రతిష్ఠించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీటీసీ సభ్యురాలికి స్వల్ప గాయాలు

కంచికచర్ల : బాల వినాయకుడి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం తిరిగి బైక్ పై ఇంటికి వెళ్తుండగా ఆటో బైక్‌ను ఢీకొన్న ఘటనలో కంచికచర్ల ఎంపీటీసీ సభ్యులు వేమా రోజా రమణికి ఆదివారం స్వల్ప గాయాలయ్యాయి. కంచికచర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో బాల వినాయకుడి ఆలయంలో జీవ ధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమం కనుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో రోజారమణి పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి రాగానే ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ముసునూరు: రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన కొటికల సీతారామయ్య తన భార్య కుమారితో కలిసి ద్విచక్రవాహనంపై ద్వారకా తిరుమల వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో వారు వలసపల్లి చేరుకోగానే ముసునూరు వైపు నుంచి ధర్మాజీగూడెం వైపు వెళుతున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో పడిపోయారు. బైక్ వెనుక ఉన్న కుమారి తలకు తీవ్ర గాయమైంది. బాధితురాలిని 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

ముసునూరు: మేకలకు నీళ్లు పెట్టేందుకు తోటలోకి వెళ్లిన మహిళపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతలవల్లికి చెందిన మహిళ శనివారం తన మేకలకు నీరు పెట్టేందుకు దారిలో ఉన్న పామాయిల్ తోటలోకి తోలుకెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన బొద్దుకోళ్ల శ్యామ్ కుమార్ మేకలకు నీరు పెడితే తోట యజమాని ఊరుకోడని అడ్డుకున్నాడు. నీరు పెట్టుకోవాలంటే తన కోర్కె తీర్చాలంటూ లైంగిక దాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేస్తూ పరిగెత్తుకుంటూ ఇంటికెళ్లి విషయం తన భర్తకు చెప్పింది. భర్త, భార్య ఇద్దరూ కలిసి నిలదీసేందుకు తోటకు వెళ్లగా వీరిపై శ్యామ్‌కుమార్ కర్రతో దాడి చేశాడు. సాయంత్రం మద్యం సేవించి భర్త, భార్యలను దుర్భాషలాడుతూ చంపేస్తానంటూ బెదిరించాడు. దీనిపై బాధిత మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

మంచి పనులు చేస్తేనే ఆత్మసంతృప్తి

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అనాసాగరంలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావును దీవిస్తున్న మహిళ

నందిగామ టౌన్: తనపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన నియోజకవర్గ జలకు మంచి చేయటం ఆత్మ సంతృప్తినిస్తుందని శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 10, 19 వార్డులలోని అనాసాగరం ఎస్సీ కాలనీ, వైఎస్సార్, వీఎం రంగా ఓపెన్ జిమ్, అంకమ్మ గుడి, తదితర ప్రాంతాలలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చి తలెత్తుకుని మీ ముందుకు వచ్చి ఓటు వేయమని అడుగుతున్నామన్నారు.

గతంలో లేని అభివృద్ధి..

గత పాలకులు చేయలేనంత అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తమ ఐదేళ్ల పాలనలో చేసి చూపించామని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ఆయా వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైన్‌లు నిర్మించి మురుగు నీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. తమ ప్రభుత్వంలో చేసిన మంచిని, అభివృద్ధి, సంక్షేమాన్ని చెప్పి ఓట్లు అడుతున్నామని ఆయన చెప్పారు. టీడీపీ సుదీర్ఘ పాలనతో ఏం చేసిందని చెప్పి ఓట్లు అడుతున్నారో అర్థం కావటం లేదన్నారు. తమ పాలనలో కులమతాలు, పార్టీలు, రాజకీయాలు చూడకుండా ప్రతి ఒక్కరికి పథకాలు అందించామని గుర్తు చేశారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటూ అండగా నిలిచామని చెప్పారు.

సీఎం జగన్‌తోనే పేదలకు న్యాయం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయితేనే పేదలకు న్యాయం జరుగుతుందని జగన్‌మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వార్డు కన్వీనర్‌లు మందా మరియమ్మ, కర్రి రవీంద్ర, కోలేటి నాగరాణి, సుబ్బారావు, నాయకులు పాములపాటి రమేష్, చాపల మల్లికార్జునరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, షేక్ ఫాతిమ, షేక్ ఖాలిక్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, షేక్ యాకుబ్ అలీ, షేక్ జాఫర్, తోట అంజారావు, పోతురాజు, కొండ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం



తిరుక్కల్యాణ మహోత్సవంలో భక్తులు

తాటిగుమ్మి(వీరులపాడు): మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో వేంచేసియున్న అలివేలు మంగా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు ప్రదీప్, వేద పండితులు సతీష్ శర్మ, జగదీష్ శర్మల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, బాలభోగం, విశ్వక్షేణారాధన, పుణ్యాహవచనం, నిత్యహోమం, నవగ్రహారాధన, నవగ్రహ హోమం, చక్రస్నానం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం 100 మంది దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారి తిరుక్కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఎమ్మెల్సీ అరుణకుమార్ పూజలు..

శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ కుమార్ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహించుకోవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ నారపరెడ్డి, ఝాన్సి, ఆలయ చైర్మన్ కొండపురెడ్డి వెంకటరామిరెడ్డి, కరుణ, సర్పంచ్ పలకా మోహన్‌రెడ్డి, నాయకులు రాఘవరెడ్డి, సుదాకర్ రెడ్డి, బెజవాడ ఉమామహేశ్వరరెడ్డి, డోర్నాల రవి, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడు మృతి



పెనుగంచిప్రోలు: అనారోగ్యంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సింగంశెట్టి ఆదిత్య (24) ఆదివారం మృతి చెందాడు. మృతునికి తల్లి గతంలో మరణించగా తండ్రి, సోదరి ఉన్నారు. ఎండలకు మూడు రోజులుగా ఆరగ్యోం బాగోలేక ఇంట్లోనే ఉంటున్నాడు. మధ్యాహ్న సమయంలో మంచంలో పడి ఉండగా స్థానిక వైద్యులు వచ్చి మృతి చెందాడని, వడదెబ్బ తగిలిందని తెలిపారని కుటుంబ సభ్యులు అన్నారు. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సందర్శించి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మండల, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, కాకాని హరి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, సోషల్‌మీడియా సభ్యులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపంతో కూలర్లకు పెరిగిన డిమాండ్!



కూలర్లు కొనుగోలు చేసి తీసుకు వెళుతున్న గ్రామస్తులు

నందిగామ: గత కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. నందిగామ ప్రాంతంలో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలను దాటిపోయాయి. ఈ నేపథ్యంలో ఎండ తాపాన్ని తట్టుకునేందుకు పేద మధ్యతరగతి ప్రజలు వినియోగించే కూలర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. వ్యాపారస్తులు కూడా వినియోగదారుల అవసరాలకు తగినట్లుగా కంపెనీ కూలర్లతోపాటు విడి సామాగ్రితో స్వయంగా కూలర్లను తయారుచేసి విక్రయిస్తున్నారు. భానుడి తాపాన్ని తట్టుకునేందుకు సామాన్యులు చౌకగా వచ్చే తయారు చేసిన కూలర్లను కొనుగోలు చేస్తుండగా మధ్యతరగతి వారు పలు రకాల కంపెనీ కూలర్లను కొనుగోలు చేస్తున్నారు. ఇక సంపన్నులు ఏసీలను వీడి బయటికి రాలేని పరిస్థితి కనిపిస్తోంది. ఏది ఏమైనా గత కొద్దిరోజులుగా పెరిగిన ఎండల కారణంగా కూలర్ల కొనుగోలు ఆశాజనకంగా ఉన్నాయని పలువురు వ్యాపారులు తెలిపారు.

వైభవంగా శ్రీసత్యమ్మకు బోనాల సమర్పణ



నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో శ్రీ సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం అమ్మవారికి విశేష పూజలతో పాటు పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో అమ్మవారికి గ్రామ బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికల కోలాహలం



అడవిరావులపాడు గ్రామంలో పార్టీలో చేరికల సందర్భంగా ఎడ్ల బండి ర్యాలీలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్

- టీడీపీని వీడుతున్న సీనియర్ నాయకులు
- వైఎస్సార్ సీపీలో మరింత జోష్ నింపుతున్న చేరికలు

నందిగామ: నందిగామ నియోజకవర్గంలో ఎన్నికల వేళ పార్టీలో చేరికల జోష్ రోజు రోజుకు పెరుగుతోంది. నాలుగు మండలాల్లో ఏదో ఒక గ్రామం నుంచి నిత్యం ప్రతిపక్ష టీడీపీని వీడి అనేక కుటుంబాలు వైఎస్సార్ సీపీలో జాయిన్ అవుతున్నాయి. ఇప్పటికే అనేక మంది సీనియర్ టీడీపీ నాయకులు, వందలాది కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో జాయిన్ అవుతున్నారు. ముఖ్యంగా టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ నే నమ్ముకొని ఉన్న అనేకమంది నాయకులు ఇటీవల వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనేక గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొన్ని కుటుంబాలు వైఎస్సార్ సీపీలో జాయిన్ అవుతున్నాయి.

సీఎం సమక్షంలో ముఖ్య నేతలు..

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటించిన సందర్భంలో నందిగామ నియోజకవర్గానికి చెందిన అనేకమంది సీనియర్ టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో జాయిన్ అయ్యారు. వారికి ముఖ్యమంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో అనేక పదవులకు చెందిన నాయకులు కొమ్ము విజయరాజు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, గోపు శ్రావణ్ కుమార్, కన్నెగంటి జీవరత్నం, వడ్డెల్లి శ్రీనివాసరావు, షేక్ కరీముల్లా, షేక్ హసీనా బేగం, ఎర్ర గొర్ల రామారావులతోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోడపాటి బాబురావు ముఖ్యమంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు.

పార్టీలోకి వస్తున్న వలసలు..

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీలో కొద్దిరోజులుగా వలసల పర్వం కొనసాగుతోంది. పలువురు ముఖ్య నాయకులతో పాటు అనేక కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో జాయిన్ అవుతున్నాయి. ఇప్పటికే కొద్దిరోజులుగా నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 486 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు , ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

భారీ ర్యాలీతో మాజీ సర్పంచి కొండలరావు చేరిక..

నందిగామ మండలంలోని అడవిరావులపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, గ్రామ మాజీ సర్పంచి తోట కొండలరావు ఆదివారం తన అనుచరులతో భారీ ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన అదే పార్టీలో కొనసాగుతున్నారు. ఇటీవల నందిగామ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితుడై పార్టీలో జాయిన్ అయ్యారు. ఇలా కొద్ది రోజులుగా వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నుంచి వలసలు వస్తుండడంతో అటు కార్యకర్తలతో పాటు నాయకులలో సైతం మంచి జోష్ కనిపిస్తోంది.

ఇంటి ముందు బైక్ చోరీ

గౌరవరం(జగ్గయ్యపేట): తన ఇంటి వద్ద పార్క్ చేసిన బైక్ చోరీ అయిందంటూ గ్రామానికి చెందిన గుంజి మోషే రాజు చిల్లకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న రాత్రి 10గంటల సమయంలో తన ఇంటిముందు పల్సర్ బైక్ పార్క్ చేశానని ఉదయం చూసేసరికి బైక్ చోరీకి గురైందన్నారు. దీంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

సాయుధ బలగాలతో కవాతు



ఈదులగూడెంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

ఆగిరిపల్లి: ఈదులగూడెంలో ఎస్ఐ సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తవేరియా నాయక్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చూడండి

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



చిల్లకల్లులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట): నియోజకవర్గంలో జరిగిన ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని చూడాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రతి ఇంట్లో సంక్షేమ పథకం ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యం అన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని 21వ వార్డులోని బ్రాహ్మణబజారులో ఉదయభాను సతీమణి విమలభాను, కుటుంబ సభ్యులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బాల వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



జీవ ధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమంలో ఎమ్మెల్సీ అరుణకుమార్

కంచికచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో బాల వినాయకుడి ఆలయంలో జీవ ధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ఆదివారం పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తారస్‌బాబు, ఎమ్మెల్సీ గోత్రనామంతో పూజలు చేసి అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, సర్పంచి వేల్పుల సునీత, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెద బాబు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధు బాబు, గుగులోతు ఇందిర, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు లగడపాటి నాగేశ్వరరావు, వేల్పుల శ్రీనివాసరావు, శేషం మధుబాబు, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, మేకల బాబు, గ్రంధి ఆదిత్య, బడేటి మల్లి, దేవిరెడ్డి శ్రీనివాసరావు, ఉప్పు స్వామి, తంగిరాల సృజినీకుమార్ పలువురు పాల్గొన్నారు.

వినాయకుడి ఆలయంలో జీవ ధ్వజ ప్రతిష్ఠ

కంచికచర్ల: కంచికచర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో బాల వినాయకుడి ఆలయంలో ఆదివారం జీవ ధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ముందుగా వేద పండితులు యోగశాలలో నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు చేశారు. స్వామి వారికి మహన్యాసపూర్వక అభిషేకాలు, మహాగవ్యవాచకము పూజలు చేశారు. ప్రత్యేకంగా హోమం చేశారు. పూజా కార్యక్రమంలో పుణ్య దంపతులు పాల్గొన్నారు. అనంతరం జీవ ధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ నిర్వాహకులు 10 మంది భక్తులకు అన్న సమారాధన చేశారు.

సీఎంను మళ్లీ గెలిపించుకోవాలి

ఉదయభాను విజయాన్ని కోరుతూ ప్రచారం



వత్సవాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

వత్సవాయి: రానున్న ఎన్నికలల్లో వైఎస్సా సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం వత్సవాయితోపాటు పెంట్యాల వారిగూడెం గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వత్సవాయిలో ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ భూక్యా సీతమ్మ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హత కలిగినవారికి ఎటువంటి సిఫారసులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదు జమ కావడం చరిత్ర అన్నారు. ఇంటికే పథకాలను పంపిస్తున్న ముఖ్యమంత్రిని మరలా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పార్టీ కార్యదర్శి గాదెల రామారావు, వైఎస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, సర్పంచ్ వడ్డే పరమయ్య, భూక్యా రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందాం



ప్రచారం నిర్వహిస్తున్న నెడ్‌కాప్ చైర్మన్ రవికుమార్

పెనుగంచిప్రోలు: సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఎన్నుకోవాలని నెడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ అన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విజయాన్ని కోరుతూ ఆదివారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరించటంతో పాటు టీడీపీ అబద్ధపు ప్రచారాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అవకాశ వాద రాజకీయాలు ఇక చెల్లవన్నారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం, అభివృద్ధి ఊసే లేదన్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో ఎన్నో అద్భుతాలు సృష్టించారన్నారు. సంక్షేమం, అభివృద్ధి నిరాటంకంగా కొనసాగాలంటే జగనన్నను మరోమారు రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నర్సయ్య, ఉపసర్పంచ్ బాడిశ పాపారావు, బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రఘునాథస్వామి కల్యాణం



రఘునాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి రఘునాథ స్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన కల్యాణం అర్ధరాత్రి వరకు కొనసాగింది. స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇక్కడ శ్రీ రామ నవమి అనంతరం మూడో రోజైన ద్వాదశి రోజున స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు మండలాల నుంచి వేలాది మంది భక్తులు గొల్లపల్లికి తరలివచ్చారు. భక్తులకు గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ నల్లూరి సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. రూరల్ సీఐ రామకృష్ణ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.